# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 3, డిసెంబరు, 2014

రంగారెడ్డి జిల్లా ముచ్చర్ల పరిధిలో 11 వేల ఎకరాల విస్తీర్ణంలో ఫార్మా సిటి నిర్మించనున్నట్లు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ప్రకటించారు. ప్రత్యేక హెలికాప్టర్లలో అధికారులు, ఫార్మా కంపెనీ ప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి కెసిఆర్ ఫార్మాసిటి ప్రతిపాదిత ప్రాంతాన్ని పరిశీలించారు. ఏరియల్ సర్వే నిర్వహించారు. ఫార్మాసిటి స్థాపనకు ఈ స్థలం అత్యంత అనుకూలమైనదిగా గుర్తించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసిఆర్ మాట్లాడుతూ హైదరాబాద్ ఫార్మాసిటి పేరుతో ఫార్మాసిటిని నెలకొల్పనున్నట్లు ప్రకటించారు. ఫార్మా యూనివర్సిటీ, ఫార్మా రీసర్చ్ ఇనిస్టిట్యూట్‌ను కూడా స్థాపించనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఎకో ఫ్రెండ్లీ ఫార్మాసిటి నెలకొల్పాలని నిర్ణయించారు. అక్కడే ఫార్మా పరిశ్రమలతో పాటు అందులో పనిచేసే ఉద్యోగుల కోసం టౌన్‌షిప్ కూడా నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఫార్మాసిటి వల్ల ఏలాంటి కాలుష్యం కలుగకుండా అన్ని చర్యలు తీసుకొంటామని, పర్యావరణానికి కూడా ఏలాంటి విఘాతం కలుగనీయమని ముఖ్యమంత్రి వెల్లడించారు. జీరో లిక్విడ్ డిశ్చార్జ్ వ్యవస్థతో ఫార్మాసిటి పనిచేస్తుందన్నారు. స్థానిక ఫార్మా కంపెనీలే అక్కడ 30 వేల కోట్ల పెట్టుబడులు పెట్టి పరిశ్రమలు స్థాపించడానికి ముందుకు వచ్చారని వెల్లడించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా 70 వేల మందికి ఈ ఫార్మా సిటి ద్వారా ఉద్యోగావకాశాలు లభిస్థాయని చెప్పారు. ముఖ్యమంత్రి వెంట వెళ్లిన ఫార్మా కంపెనీ ప్రతినిధులు కూడా ప్రతిపాదిత ఫార్మాసిటి పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ముచ్చర్ల ప్రాంతంలోని స్థలం అత్యంత అనువైనదిగా వారు అభిప్రాయపడ్డారు. ఫార్మా సిటి ఏర్పాటు చేయడం కోసం అన్ని చర్యలు తీసుకోవాలని, పనులు వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ముఖ్యమంత్రి వెంట మంత్రి మహేందర్ రెడ్డి, మహేశ్వరం ఎమ్మెల్యే తీగల క ృష్ణారెడ్డి, రెవిన్యూ

శాఖ కార్యదర్శి మీనా, పరిశ్రమల శాఖ కార్యదర్శి ప్రదీప్‌చంద్ర, ముఖ్యకార్యదర్శి నర్సింగరావు, టిఎస్ఐఐసి యండి. జయేష్‌రంజన్, ఫార్మాకంపెనీల ప్రతినిధులు బి.పార్థసారథిరెడ్డి, కె.రత్నాకర్ రెడ్డి (హెటిరో), కె.సతీష్‌రెడ్డి (డాక్టర్ రెడ్డీస్), కె.నిత్యానందరెడ్డి (అరబిందో), యం.నారాయణరెడ్డి (విర్కో), పి.ఈశ్వర్‌రెడ్డి (బిడిఎంఎ), యంఎస్ఎన్.రెడ్డి (యంఎస్ఎన్ ల్యాబ్స్), సంతోష్ (వివి మెడ్), డా.ఎస్. ఆనంద్(సాగర్ గ్రూప్), యం.మోహన్‌రావు (సైనుడ్) తదితరులు పర్యటించినవారిలో ఉన్నారు.

---

సిపిఆర్ఓ టు సిఎం

# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-2 3, డిసెంబరు, 2014

కొత్తగా మంజూరైన కేంద్రీయ విద్యాలయాల్లో వచ్చే విద్యా సంవత్సరం నుండి విద్యా బోధన జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అధికారులను ఆదేశించారు. నల్గొండ జిల్లా తుంగతుర్తి,మిర్యాలగూడ, వరంగల్ జిల్లా మహబూబాబాద్, ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాల, కరీంనగర్ జిల్లా సిరిసిల్ల, మెదక్ జిల్లా జరాసంఘం, నిజామాబాద్ జిల్లా బోధన్‌లలో కేంద్రీయ విద్యాలయాలు మంజూరైన నేపథ్యంలో ముఖ్యమంత్రి బుధవారం అధికారులతో మాట్లాడారు. ఈ విద్యాలయాల స్థాపనకు అవసరమైన స్థలాలను అప్పగించాలని, ఇతర ఏర్పాట్లను కూడా పర్యవేక్షించాలని ఆదేశించారు.

---

సిపిఆర్ఓ టు సిఎం